వైసీపీలో బీసీలకు మొండిచేయి

బహిరంగ సభల్లో సీఎం జగన్ చేతిలో మైకు దొరికితే చాలు నా బీసీలు, నా ఎస్టీలు అంటూ వారిపై ఎనలేని ప్రేమను ఒలకబోస్తారు. పవర్ లేని, నిధులు లేని పదవులు మాత్రమే వీరికి ఇచ్చి సామాజిక న్యాయం పాటించామంటూ గొప్పలు చెబుతారు. బీసీలకు తానే వెన్నెముక అంటూ కటింగ్ ఇస్తారు. సొంత జిల్లాలో కీలకమైన ఎమ్మెల్యే పదవులు మాత్రం జగన్ తన సామాజిక వర్గానికే కట్టబెట్టి బీసీలను పల్లకీలు మోసే వారిలా మార్చారన్న విమర్శ ఉంది. 2019 ఎన్నికల్లో ఎలాగూ మొండిచేయి చూపారు. ఈ సారైనా బీసీలకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారా, ఇవ్వరా అన్న చర్చ వైసీపీలోని బీసీ నేతల్లో ఉంది.

- 2019 ఎన్నికల్లో ఒక్క టికెట్టూ ఇవ్వలేదు
- రిజర్వుడ్ స్థానాల్లో మినహా అన్ని చోట్లా జగన్‌రెడ్డి సామాజిక వర్గమే
- కడప ఎమ్మెల్యే టికెట్‌పై మేయరు సురేశ్‌బాబు కన్ను
- మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగుపై బీసీ నేతల ఆశలు
- ఈ సారైనా బీసీలకు ఎమ్మెల్యే టికెట్టు దక్కేనా..?

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ సామాజిక వర్గం పెద్దసంఖ్యలో ఉన్నారు. 2019 ఉమ్మడి జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడ్ స్థానాలైన రైల్వేకోడూరు, బద్వేలు మాత్రమే వారికి కేటాయించారు. ఇక కడపను మైనార్టీలకు ఇచ్చారు. మిగతా ఏడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను రెడ్డి సామాజిక వర్గాలకే కేటాయించారు. బీసీ సామాజిక వర్గాలకు ఒక్క సీటు కూడా కేటాయించకుండా మొండిచేయి చూపారు.

బీసీల్లో అసంతృప్తి

ఉమ్మడి కడప జిల్లాలో బీసీ, బలిజ కులస్తులకు టీడీపీ ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది. 2014-19 ఎన్నికల్లో మైదుకూరు నుంచి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను బరిలో దింపింది. అనంతరం ఆయనను టీటీడీ చైర్మన్ చేశారు. ఉమ్మడి జిల్లాలో పాలకొండ్రాయుడు, ప్రస్తుత ఎమ్మెల్సీ రామచంద్రయ్య, మాజీమంత్రి బ్రహ్మయ్య, గుటిపాటి కేశవులకు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు కేటాయించి బరిలోకి దింపింది. అయితే వైసీపీ పాలనలో మాత్రం ఇటు బీసీలకు, అటు బలిజలకు పెద్దగా ప్రాధాన్యం లేదని చెబుతారు.

బీసీలకు ప్రాధాన్యత దక్కేనా ?

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులను సీఎం జగన్ త్వరలో ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో బీసీ నేతలు ఈసారైనా తమకు ప్రాధాన్యత ఉందా, లేదా అన్న ఆసక్తితో ఉన్నారు.

- కడప మేయర్ సురేశ్‌బాబుకు ఎమ్మెల్యేగా పోటీ చేసి చట్టసభల్లో అడుగుపెట్టాలన్నది ఆశయం. ఈయన కుటుంబం చిన్నచౌకు పంచాయతీ సర్పంచ్‌గా 30 ఏళ్లపాటు సేవలందించింది. ఈయన మొదటి నుంచి వైఎస్ కుటుంబానికి విధేయుడుగా ఉంటున్నారు. జడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. జగన్ పార్టీ స్థాపించిన తరువాత వైసీపీకి వెళ్లారు. ప్రస్తుతం మేయరుతో పాటు వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. కడపలో బీసీలో ముఖ్యనేతగా ఈయనకు పేరుంది. కడప అసెంబ్లీ నుంచి పోటీ చేయాలని చాలా ఏళ్లుగా భావిస్తున్నారు. 2014-19 ఎన్నికల్లో టికెట్‌పై ఆశ పెట్టుకున్నారని చెబుతారు. కనీసం ఎమ్మెల్సీ అయినా ఇస్తారని ఆయన వర్గాలు భావించాయి. అయితే కడప మేయర్‌కే పరిమితం చేయడాన్ని ఆయన వర్గీయులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈసారైనా టికెట్ వస్తుందా రాదా అన్న ఆందోళన ఆయన వర్గీయుల్లో ఉంది. ఇక కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అనుచరుడు, బీసీ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటరు పాకా సురేశ్ సైతం కడప ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. సిట్టింగుల్లో మార్పులుండడంతో టికెట్ వస్తుందేమోనని వీరిద్దరూ ఆశతో ఎదురు చూస్తున్నారు.
- మైదుకూరులో బీసీ జనాభా ఎక్కువగా ఉంది. ఇక్కడ టీడీపీ నుంచి పుట్టా సుధాకర్‌యాదవ్ ఇన్‌చార్జిగా ఉన్నారు. వైసీపీ కూడా ఇక్కడ బీసీలకే టికెట్ కేటాయించాలని ఆ పార్టీ వర్గాలు కోరుతున్నాయి. దువ్వూరుకు చెందిన అంజుయాదవ్ శ్రీకాళహస్తిలో సీఐగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆమె పేరు కూడా వైసీపీ అభ్యర్థిగా ప్రచారంలోకి వచ్చింది.
- ప్రొద్దుటూరులో చేనేత ఇతర బీసీ వర్గాలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అయితే వైసీపీ ఇక్కడ గత ఎన్నికల్లో రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డికి టికెట్ కేటాయించింది. ఈసారి అక్కడున్న చేనేత నాయకులు బొర్రా రామాంజనేయులు ఇతర బీసీ నేతలు టికెట్‌పై ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఇక్కడ రమేశ్ యాదవ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినప్పటికీ రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇద్దరూ ఒకే వేదిక పంచుకున్న దాఖలాలు దాదాపు లేవని చెబుతారు. ఎమ్మెల్సీ అనే తప్ప రమేశ్‌యాదవ్‌కు ఎలాంటి ప్రాధాన్యతలేదని చెబుతారు. ఎమ్మెల్సీ ఇచ్చేసి ఈయనను డమ్మీ చేశారన్న ప్రచారం ఉంది. దీంతో ఈయన కూడా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారని అంటున్నారు.
- ఇక జమ్మలమడుగులో సైతం చేనేతలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. సామాజిక న్యాయం పాటిస్తే ఇది కూడా బీసీలకు ఇవ్వాల్సి ఉందని చెబుతారు. ఇక్కడ వైసీపీలో నాగేంద్ర బీసీ నేతగా ఉన్నారు.



ఈ సారైనా..

వచ్చే ఎన్నికల్లో గెలుపొంది తిరిగి అధికారం చేపట్ట డమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా వ్యతిరేకత పేరిట 70 మందికి పైగా సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారుస్తారని వైసీపీలో ప్రచారం సాగుతోంది. పొరుగు జిల్లాల్లో ఎలా ఉందో కడపలో కూడా ప్రభుత్వంపై సీఎం వ్యతిరేకత అలానే ఉందని చెబుతారు. ఈ నేపథ్యంలో సిట్టింగుల్లో టికెట్ మారిస్తే బీసీలకు ప్రాధాన్యం ఇస్తారేమోనన్న ఆశ ఆ వర్గాల్లో ఉంది. చూద్దాం.. మరి ఈ సారి బీసీలకు కేటాయిస్తారో లేక షరా మామూలుగానే కేవలం తన సామాజిక వర్గానికే మాత్రమే టికెట్లు ఇచ్చి వీరికి మొండిచేయి చూపుతారో చూద్దాం..

బీసీ నాయకత్వం ఎదగనివ్వకూడదనే..

జిల్లాలో బీసీలు పెద్దసంఖ్యలో ఉన్నప్పటికీ రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేగా ఉన్న చోట బీసీ నేతలను వైసీపీలో ఎదగకుండా చేశారనే విమర్శ ఉంది. పేరుకే జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు తప్ప ఆయన సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదంటారు. ఆయన అసెంబ్లీ టికెట్ ఆశిస్తే కనీసం ఎమ్మెల్సీ అయినా వస్తుందనుకుని భావించారు. అయితే రెండోసారి ఆయనకు మేయర్ ఇచ్చి సర్దారనే విమర్శ ఉంది. ఇక కార్పొరేటర్ల విషయానికొస్తే పాకాసురేశ్, బసవరాజులు బీసీల్లో చెప్పుకోదగ్గ నేతలుగా ముద్రపడ్డారు. వారిని ఎదగనివ్వకుండా కార్పొరేషన్‌లో కీలకమైన పదవులు ఇవ్వలేదని చెబుతారు. ఇక మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో ద్వితీయశ్రేణి నాయకత్వం నుంచి కీలకమైన నేతగా ఈ ఐదేళ్లలో ఒక్కరిని కూడా ఎదగనివ్వకుండా తొక్కిపెట్టారని వైసీపీ వర్గాలే అంటున్నాయి.

వైఎస్సార్‌కు షర్మిల నివాళి



ఇడుపులపాయలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

- కుమారుడి వివాహ పత్రిక సమాధిపై ఉంచి ఆశీర్వాదం
- రాత్రి ఇడుపులపాయలోనే బస
- నేడు ఢిల్లీకి పయనం

వేంపల్లె, జనవరి 2: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద ఆయన తనయ వైఎస్ షర్మిల, తల్లి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి నివాళులు అర్పించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కడపకు, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఇడుపులపాయకు చేరు కున్నారు. షర్మిల, విజయలక్ష్మి, కుమారుడు రాజారెడ్డి, కుమార్తె అంజలి, కాబోయే కోడలు అట్లూరి ప్రియ వారి తల్లిదండ్రులతో కలిసి 5:30 గంటల ప్రాంతంలో వైఎస్సార్ ఘాట్‌కు చేరుకున్నారు. ఫాదర్ నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధిపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను ఉంచి వైఎస్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఘాట్ ఆవరణలోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడుతూ కాబోయే నూతన వధూవరులు సంతోషంగా ఉండేలా ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేసేందుకు ఇది వరకే నిర్ణయం తీసుకున్నానని, బుధవారం ఢిల్లీకి వెళ్తున్నానని అన్ని విషయాలకు సమాధానాలు చెబుతానని అన్నారు. అనంతరం విశ్రాంతి భవనానికి వెళ్లారు. కాంగ్రెస్ నాయకులు వేలూరు శ్రీనివాసులరెడ్డి, శ్రీరాములు, ధ్రువకుమార్‌రెడ్డి తదితరులు కలిశారు. వైసీపీ నాయకులు జయరామిరెడ్డి, భోజనపల్లి భారతి, కుమ్మరాంపల్లె రామాంజనేయరెడ్డి తదితరులు షర్మిలను కలిసి మాట్లాడారు. రాత్రి ఇడుపులపాయలోనే బస చేశారు. బుధవారం ఉదయం ఢిల్లీకి పయనమవుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా.. కడప నుంచి రోడ్డు మార్గం ద్వారా ఇడుపులపాయకు వచ్చిన షర్మిలకు పెండ్లిమర్రి, కుమ్మరాంపల్లె గ్రామాల వద్ద స్థానిక నాయకులు స్వాగతం పలికారు.

టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జనవరి 2: ఈ విద్యాసంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన హాల్లో పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపు, విద్యార్థుల ఆరోగ్యం, మనబడి నాడు-నేడు ఫేజ్-2 పనుల పురోగతిపై సమగ్ర శిక్ష పీవో డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది పదోతరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. సిలబస్ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గత ఏడాది పదవ తరగతిలో వచ్చిన ఫలితాలను బేరీజు చేసి ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. 6 వతరగతి నుంచి అన్ని తరగతులకు ఐఎఫ్‌పీ ఇన్‌స్టలేషన్ కచ్చితంగా జరగాలన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై, అంగన్వాడీ చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నాడు-నేడు పనులు ఏవైనా అసంపూర్తిగా ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ఎన్నికలకు సంబంధించి మండల తహశీల్దారు సహకారంతో సంబంధిత ఇంజనీరింగ్ టీమ్‌తో కలసి తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఎంఈవోలను కలెక్టర్ ఆదేశించారు.

రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలి



పులివెందులలో స్టేడియం పనుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

పులివెందుల, జనవరి 2: పులివెందులలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీపడకుండా పూర్తిచేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. మంగళవారం ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పట్టణంలోని క్రికెట్ స్టేడియం, బనానా ప్యాక్ హౌస్ పనులను పరిశీలించారు. పనుల పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శాఖల వారీగా సమీక్షించారు. ఈ సమీక్షలో ఆర్‌అండ్‌బీ, మోడల్‌టౌన్ ప్రతినిధులు, మున్సిపల్, ఏపీ టూరిజం శాఖ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, మోడల్ టౌన్ ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దున్నపోతు మీద వాన కురిసినట్లే..

- ఇచ్చిన హామీలను అమలు చేయరు
- సమ్మె చేస్తే అడ్డుకుంటారు
- వైసీపీ ప్రభుత్వంపై అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికుల మండిపాటు



బద్వేలులో దున్నపోతుకు అంగన్వాడీల వినతి

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వానికి ఎంతగా విన్నవించకున్నా దున్నపోతుమీద వాన కురిసినట్టుగా ఉంది. వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతుంటే పట్టించుకోలేదు. సమ్మెలోకి వెళితే భగ్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది అంటూ అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం 22 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెబాట పట్టారు. ప్రభుత్వం బలవంతంగా సమ్మెను భగ్నం చేసే యత్నం చేస్తూ వస్తోంది. అంగన్వాడీ కార్యాలయాల తాళాలను గొడ్డళ్లు రాళ్లతో పగలగొట్టి కేంద్రాలు తెరిచింది. మంత్రివర్గ ఉప సంఘం చర్చలు జరిపినప్పటికీ జీతాల పెంపు ఇతర వాటికి ప్రభుత్వం ముందుకు రాలేదు. దీంతో అంగన్వాడీలు సమ్మె కొనసాగిస్తున్నారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు తీర్పు, జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని దీక్ష, సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. 22వ రోజు మంగళవారం అంగన్వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బద్వేలు, పోరుమామిళ్ల, మైదుకూరులో దున్నపోతులకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. 22 రోజులుగా పోరాడుతున్నా దున్నపోతు మీద వర్షం కురిసినట్టుగా తయారైందని అన్నారు. కడపలో సమ్మె కొనసాగించారు. మోకాళ్లపై కూర్చుని జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మె 22వ రోజులకు చేరడంతో కొండాపురంలో 22 అంకెలా మానవహారం నిర్వహించారు. చాపాడులో నిరసనలు కొనసాగాయి. ముద్దనూరులో ఎస్టీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. జమ్మలమడుగులో మోకాలిపై కూర్చుని నిరసన తెలిపారు. పలుచోట్ల గడ్డి నోట్లో పెట్టుకుని ఆందోళన చేశారు.

ఇక మున్సిపల్ కార్మికులు 8వరోజూ సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా రిలేదీక్షలు కొనసాగించారు. బద్వేలులో ఆకులు కట్టుకుని నిరసన తెలిపారు. కడపలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన కొనసాగించారు. పలువురు మున్సిపల్ కార్మికులు జోలెతో భిక్షాటన చేశారు.





జమ్మలమడుగు, కొండాపురంలలో నోట్లో గడ్డితో అంగన్వాడీలు



కడపలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



ప్రొద్దుటూరులో నోట్లో గడ్డి పెట్టుకుని అంగన్వాడీల నిరసన



కడపలో జోలెపట్టి భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



బద్వేలులో ఆకులు కట్టుకుని మున్సిపల్ కార్మికుల ఆందోళన

రూ.825.62 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్



స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన మేయర్ సురేశ్‌బాబు, కమిషనర్ ప్రవీణ్‌చంద్ తదితరులు

- స్టాండింగ్ కమిటీ ఆమోదం

కడప(ఎర్రముక్కపల్లె), జనవరి 2: కడప కార్పొరేషన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.825.62 కోట్లతో బడ్జెట్ రూపొందించింది. బడ్జెట్ ముసాయిదాపై మేయర్ కె.సురేశ్‌బాబు అధ్యక్షతన మంగళవారం సమావేశమైన స్టాండింగ్ కమిటీ ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ప్రభుత్వం కడప నగర సుందరీకరణలో భాగంగా కార్పొరేషన్‌కు భారీగా నిధులు విడుదల చేసింది. ప్రధానంగా రోడ్ల విస్తరణ, సర్కిల్స్ సుందరీకరణ, దేవునికడప చెరువు సుందరీకరణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు విడుదల చేసింది. వాటిని కూడా ఇందులో పొందుపరచడంతో బడ్జెట్ భారీగా పెరిగిందని చెప్పాలి. 2024-25 సంవత్సరం బడ్జెట్ ప్రారంభ విలువ రూ.66.62 కోట్లు అంచనగా చూపారు. జమలు రూ.758.99 కోట్లు కాగా, మొత్తం రూ.825.62 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించారు. వాటిలో ఖర్చులు రూ.757.61కోట్లు చూపగా మిగులు రూ.68 కోట్లు చూపారు. కొన్ని కొన్ని సవరణలతో స్టాండింగ్ కమిటీ సభ్యులు బడ్జెట్ ఆమోదించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేషన్‌కు సంబంధించిన వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లెదుటే కబ్జా

కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములున్నా, రెవెన్యూ అధికారులు వాటిని సంరక్షించడం లేదు. రికార్డుల్లో పక్కాగా ప్రభుత్వ భూమిగా ఉన్నా వాటిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవడం లేదు. దీంతో ఏడబ్ల్యూ ల్యాండ్, రోడ్డు పోరంబోకు స్థలాలు సైతం కళ్లెదుటే అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలో, చుట్టూ 5 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉన్నా కబ్జా అవుతోంది.



ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలానికి ప్రహరీ నిర్మించి ఆక్రమించిన దృశ్యం

- రూ.8 కోట్ల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం
- 50 సెంట్లకు పైగా ఏడబ్ల్యూ లాండ్..
- 1.26 ఎకరాల రోడ్డు పోరంబోకు ఆక్రమణ
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు, జనవరి 2: ప్రొద్దుటూరు పట్టణం 1వ వార్డు బొల్లవరంలో సర్వేనెంబరు 506లో 84 సెంట్ల ఏడబ్ల్యూ లాండ్ ఉంది. దీని పక్కనే 569-బి కి సంబంధించి 1.26 ఎకరాల రస్తా పోరంబోకు ఉంది. ఈ భూములను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంరక్షించక పోవడంతో అన్యాక్రాంతమయ్యాయి. 84 సెంట్ల ఏడబ్ల్యూ లాండ్‌లో 50సెంట్లకు పైగా ఆక్రమించి ఆవాసాలు ఏర్పర చుకున్నారు. మిగిలిన 30 సెంట్ల స్థలానికీ ప్రహరీ కట్టి కబ్జా దారులు ఆక్రమించారు. వాటిలో చెట్లు వేసి ప్రైవేటు పార్కులా వినియోగించుకుంటున్నారు. దీనికి ఆనుకుని ఉన్న 569-బికి సంబంధించి 1.26 ఎకరాల రస్తా పోరంబోకు స్థలంలో దాదాపు 26 సెంట్లమేర ఆక్రమణకు గురైంది. ఇందులో కట్టడాలు వెలిశాయి. ఎకరా భూమి మున్సిపల్ లేఅవుట్ ప్లాట్లలో కలిసినట్లు అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ లేఅవుట్ ప్లాట్లలో ఉన్న ఈ ఎకరా భూమికి కూడా ఎటువం టి రక్షణ చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ రికార్డు ప్రకారం ఏడబ్ల్యూ ల్యాండ్ ఉన్నా రస్తా పోరంబోకు ఉన్న ఏ భూములను పరిరక్షించే బాధ్యత తమదికాదని అన్నట్లు ఇక్కడి అధికారులు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ సెంటు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు పలుకుతోంది. ఈ లెక్కన ఆక్రమణకు గురైన 76సెంట్ల స్థలం ఎంత తక్కువ అనుకున్నా రూ.8కోట్లకు పైగానే చేస్తుంది. ఇంత విలువైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ వారు సంరక్షించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆర్‌ఎస్‌ఆర్‌లో చుక్కల భూమిగా..

రెవెన్యూ రికార్డులైన ఆర్‌ఎస్‌ఆర్‌లో చుక్కల భూమిగా ఉందని వీఆర్‌వో అంకాల్‌రెడ్డి తెలిపారు. వెబ్‌లాండ్‌లో మాత్రం ఏడబ్ల్యూ లాండ్‌గా ఉందన్నారు. పాత అడంగల్‌లో మాత్రం దొంతిరెడ్డి వెంకటరెడ్డి పేరు నమోదైనట్లు చెబుతున్నారు. ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం చుక్కల భూములన్నీ పట్టా భూములుగా మారిపోయాయని అయితే ఈ 506 సర్వేనెంబరులో దొంతిరెడ్డి వెంకటరెడ్డి పేరు తప్ప అడంగల్‌లో మరొకరి పేరు లేదన్నారు. కానీ ఆ భూముల్లో కొందరు చాలాకాలంగా ఆక్రమించి కట్టిన నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. 569-బి సర్వేనెంబరులోని రస్తా పోరంబోకు స్థలం సైతం ఆక్రమణకు గురైందని ఇందులో ఎకరా భూమి మాత్రం మున్సిపల్ లేఅవుట్ కాలనీలో కలిసివుందని అన్నారు. ఆ భూమిని రికార్డుల్లో రస్తా పోరంబోకు నుంచి మార్చటానికి సంబంధించి మున్సిపల్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారని అన్నారు. కాగా.. ఏడబ్ల్యూ లాండ్ ఆక్రమణపై తహసీల్దారు నజీర్ అహ్మద్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.



ప్రభుత్వ స్థలంలో వెలసిన అంతస్తుల భవనం

సాధికార బస్సు యాత్ర కోసం రైల్వేకోడూరు అష్టదిగ్బంధం!

- నేడు ప్రైవేటు స్కూళ్లు మూసివేయాలని ఆదేశం
- జనాల కోసం స్కూలు బస్సులు ఏర్పాటు చేయాలని హుకుం..!
- భారీగా ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం




రైల్వేకోడూరులో క్రేన్‌తో వైసీపీ జెండాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం, బస్సు యాత్ర సభ నిర్వహించే స్థలం ఇదే

రైల్వేకోడూరు, జనవరి 2: వైసీపీ సాధికార బస్సు యాత్ర బుధవారం రైల్వేకోడూరులో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం మంగళవారం రైల్వేకోడూరు వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ప్రధాన రహదారి వరకు అష్టదిగ్బంధం చేస్తున్నారు. బుధవారం పట్టణంలోని అన్ని ప్రైవేటు స్కూళ్ల ను మూసివేయాలని అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని స్కూళ్ల యాజమాన్యాలు సెలవు ప్రకటించారు. అదేకాకుండా స్కూళ్ల బస్సుల ద్వారా ప్రజలను సభకు తరలించాలని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు హుకుం జారీ చేశారు. వైసీపీ సాధికార బస్సు యాత్రతో భారీగా ట్రాఫిక్ సమస్యను ప్రజలు ఎదుర్కోనున్నారు. రైల్వేకోడూరులో ఒక్క ప్రధాన రహదారి మాత్రమే ఉంది. బైపాస్ రోడ్డు కూడా లేదు. మహారాష్ట్ర, హైదరాబాద్, కర్నూలు, కడప, రాజంపేట వాసులు నిత్యం తమిళనాడు, తిరుపతి, తిరుమలకు వెళుతుంటారు. ఇటు తిరుపతి, అటు కడప రూటులో భారీగా వాహనాలు తిరుగుతుంటాయి. బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు సాధికార సభ ఉంటుం ది. ఉదయం 11 గంటల నుంచి ర్యాలీ ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతుంది. ఊరికి దూరంగా చాలా విశాలమైన ప్రాంగణాలున్నా కడప-తిరుపతి ప్రధాన దారిలో బస్సు యాత్ర పెట్టడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రోడ్డు డివైడర్‌పై వైసీపీ జెండాలు నాటారు. పెద్ద క్రేన్‌తో జెండాలు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ అటవీశాఖ అతిథిగృహం ప్రాంగణంలో భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. వైసీపీ బస్సు యాత్రతో అటు కుక్కలదొడ్డి నుంచి ఇటు ఓబులవారిపల్లె వరకు వాహనాలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ట్రాఫిక్ సమస్యను పోలీసులు ఎలా అరికడతారో వేచి చూడాల్సిందే. కాగా ట్రాఫి క్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా సూరపురాజుపల్లె నుంచి రాఘవ రాజపురం మీదుగా మళ్లిస్తామని చెబుతున్నారు. ఇది పూర్తిగా పల్లెల దారి, సింగిల్ రోడ్డు కావడంతో పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుం దని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తాం

వైసీపీ నిర్వహిస్తున్న సాధికార బస్సు యాత్రకు అను మతి ఉంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండలంలోని సూరపు రాజుపల్లె నుంచి రాఘవరాజపురం వరకు దారి మళ్లించాం. వాహన దారుల అవగాహన కోసం పోలీసుల సమక్షంలో ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

-మధుసూదన్‌రెడ్డి, సీఐ, రైల్వేకోడూరు.

పంచాయతీరాజ్ రాష్ట్ర సదస్సును జయప్రదంచేయండి

కడప రూరల్, జనవరి 2: గుంటూరు జిల్లా మంగళగిరిలో జనవరి 3న నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ రాష్ట్ర సదస్సులో పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పాల్గొని జయప్రదం చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. అందుకే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరూ పాల్గొని 16 డిమాండ్ల సాధనకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

అప్రెంటీస్‌కు ఎంపికైన వారు 8న హాజరు కావాలి

కడప (మారుతీనగర్), జనవరి 2: ఏపీఎస్ ఆర్టీసీ అప్రెంటీషిప్‌కు ఎంపికైన జిల్లాలోని ఐటీఐ అభ్యర్థులు ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటలకు కర్నూలులోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజిలో హాజరు కావాలని కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రత్నరాజు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, కుల ధ్రువీకరణ పత్రం, వికలత్వ ధ్రువీకరణపత్రం, పాన్‌కార్డ్, ప్రభుత్వం జారీచేసిన ఐడీ ప్రూఫ్, బ్యాంక్ ఖాతా పాస్‌బుక్, 3 ఫొటోలు, ఆధార్‌కార్డుతో సహా 3 సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఎంపికైన అభ్యర్థుల వివరాలిలా....

డీజల్ మెకానిక్ విభాగంలో... 189, 67, 96, 164. 158, 185, 22, 32, 183, 210, 139, 104, 78, 151, 176, 204, 252, 148, 10, 196, 216, 130, 6, 153, 193, 63, 92, 76, 212, 108, 179, 194, 195, 161, 87, 137, 88, 165, 192, 95, 186, 177, 18, 56, 25, 33, 198

మోటార్ మెకానిక్ విభాగంలో...... 37, 23, 29, 20, 8, 43, 50, 38,

ఎలక్ట్రీషియన్.. 3, 56, 30, 59,

వెల్డర్... 01, **మెషనిస్ట్....** 3, 20, **ఫిట్టర్..**8, 26

డ్రాఫ్ట్‌మాన్ (సివిల్) 24, 15 రిజిస్ట్రేషన్ నెంబర్లు గల వారు ఏదేని ఇతర వివరాలకు కడప ఐటీఐ సర్కిల్‌లోని తమ డీఎల్‌టీసీ కాలేజిలోని అప్రెంటీస్ అడ్వసర్‌ను సంప్రదించాలని కోరారు.

ఒక్క క్లిక్‌తో సమగ్ర సమాచారం

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



సీఎంఎస్‌ని ప్రారంభిస్తున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 2: వైవీయూలో జరిగే ప్రతి కార్యక్రమం వెబ్‌సైట్ కాన్ఫరెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంలో అందుబాటులో ఉంటుందని... ఒక్క క్లిక్‌తో సమగ్ర సమాచారం పొందవచ్చని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ అన్నారు. మంగళవారం వైవీయూ ఐటీ అండ్ నెట్‌వర్కింగ్ సెల్ సంచాలకులు ప్రొఫెసరు ఎంవీ శంకర్ నేతృత్వంలో రూపకల్పన చేసిన సీఎంసిస్టంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్శిటిలో నిర్వహించే కాన్ఫరెన్స్ సెమినార్ వర్క్‌షాపుల బ్రోచర్లు, రిజిస్ట్రేషన్ వెబ్ లింకు, చెల్లింపు ఎంపికలు కమిటీ సమాచారం, ప్రోగ్రాం షెడ్యూలు, స్పీకర్ ప్రొఫైల్, ఫొటోగ్రాఫ్, సర్క్యులర్లు, సంప్రదించాల్సిన వారి సమాచారం ఇలా అనేక వివరాలు ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చన్నారు. అనంతరం రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఐక్యు ఏసీ డైరెక్టరు సుబ్రహ్మణ్య శర్మ, సీడీసీ డీన్ ప్రొఫెసరు రవిబాబు, దాము, విజయభారతి, ఎస్వీక్రిష్ణారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

వైవీయూ ఎంబీఏ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ అన్నారు. వైవీయూ గురుకుల భవనాలను రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ఏడాది ఎంబీఏ, హెచ్‌ఆర్ఎం కామర్స్ కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిన దృష్ట్యా తరగతి గదుల నవీకరణ చేస్తామన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైవీయూ ఇంజనీరుతో చర్చించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి అమృత్ ప్రసాద్‌రెడ్డి, ఎస్వీ సుబ్బారెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ గంగయ్య పాల్గొన్నారు.


పశువులకు తప్పక టీకాలు వేయించుకోవాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

కడప రూరల్, జనవరి 2: గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకుని తమ పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పోస్టర్లను జేసీ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జనవరి 2 నుంచి 31 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేస్తారన్నారు. ఇందుకు 400700 డోసులు సరఫరా చేసి పాడి రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. జిల్లాలోని పశుపోషకులు ప్రభుత్వం అందించే ఈ ఉచిత టీకాలను తమ పశువులకు వేయించుకుని గాలికుంటు వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవాలని కోరారు. పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, నోటి మధ్య, కాలిగిట్టల మధ్య పుండ్లు, సూడి పశువులు ఈసుకుపోవడం ఈ వ్యాధి ముఖ్య లక్షణాలన్నారు. వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. కాబట్టి రైతులు పశువు లకు టీకాలు తప్పకుండా వేయించుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.



అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి




ఉరి వేసుకుని మృతి చెందిన బాలుడు, అనిమేష్ (ఫైల్)

వల్లూరు, జనవరి 2: మండల కేంద్రమైన వల్లూరులోని ఈద్గా సమీపంలో మంగళవారం వేప చెట్టుకు చీరతో ఉరి వేసుకుని అనిమేష్ (16)అనే బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొప్పోలు దళితవా డ గ్రామానికి చెందిన పొట్లి క్రిష్ణ కుమారుడు పొట్లి అనిమేష్ జనవరి 1న సినిమాకు వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో మంగళవారం బాలుడి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభించలేదు. అయితే బాలుడి తండ్రి వేరే చోట పనివద్ద ఉండగా, మీ కుమారుడు ఉరి వేసుకుని చనిపోయాడని స్థానికులు ఫోను ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో అతను హుటాహుటిన సంఘటనాస్థలం వద్దకు వచ్చి తమ కుమారుడని నిర్ధారించారు. సీఐ రామక్రిష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. బాలుడి తండ్రి క్రిష్ణ తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

అమూల్ పాలసేకరణ 90 శాతం జరగాలి : కలెక్టర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పీఎస్ గిరీషా

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 2: జిల్లాలో పాడి రైతుల నుంచి అమూల్ పాలసేకరణ పక్కాగా జరిగేలా చూడాలని కలెక్టర్ పీఎస్ గిరీషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలో పాలసేకరణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి వివరించి.. అమూల్‌కు పాలసేకరణ 90 శాతం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జగనన్న పాల వెల్లువ ప్రాముఖ్యతను అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు ప్రజాప్రతినిధుల సహకారంతో పాడి రైతులకు తెలియజేసి అమూల్‌కు పాలుపోసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం, గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పశువర్థకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

కడప (క్రైం), జనవరి 2: కడప-కనుమలోపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కమలాపురానికి చెందిన మీగడ వీరశివారెడ్డి (30) లారీ డ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా మంగళవారం ఇంటి వద్ద నుంచి కడపకు వచ్చి జేఎంజె కళాశాల సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బి.కోడూరు, జనవరి 2: మండల పరిధిలోని కొండంపల్లె గ్రామానికి చెందిన యాసాని సుబ్బరాయుడు (70) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సుబ్బరాయుడు బద్వేలుకు వెళుతుండగా పశువులు అడ్డుగా రావడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప (క్రైం), జనవరి 2: మాధవరం-1 సమీపంలోని రైల్వే ట్రాక్‌పై మంగళవారం తెల్లవారుజామున రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి (30) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. తిరుపతి వైపు వెళ్లే రైలు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిత్యావసర సరుకులు ప్రతి ఒక్కరికీ అందించాలి



నిత్యావసర వస్తువుల ఆటోను పరిశీలిస్తున్న ఆర్డీఓ

వల్లూరు, జనవరి 2 : ప్రభుత్వం పేదల కోసం కల్పిస్తున్న నిత్యావసర వస్తువులను నేరుగా ఇంటి వద్దకే వెళ్లి అందించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన వల్లూరులోని ఎస్సీ కాలనీలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఆటోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు ఖచ్చితంగా ఇచ్చిన సమయంలో గృహాల వద్దకే వెళ్లి ఇవ్వాలని, అది మీబాధ్యత అన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. అందరూ సరుకులు ఖచ్చితంగా తీసుకెళ్లాలన్నారు. స్థానిక అధికారులతో మాట్లాడి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. వీరి వెంట సీనియర్ అసిస్టెంటు స్వరూప్, వీఆర్వో రామ్మోహన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు

కడప(కలెక్టరేట్), జనవరి 2: కడప నియోజకవర్గ పరిధిలోని 50 డివిజన్ల వారీగా వార్డు, బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుడ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కడప నగర అధ్యక్షుడు వై.విష్ణు ప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో కడప కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్ల ఇన్‌చార్జులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా, నగర అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి పాటు పడాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌ఏ సత్తార్, చీకటి చార్లెస్, మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీఖాన్, పీసీసీ డెలిగేట్ పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి, నగర ఉపాధ్యక్షుడు మధురెడ్డి, నాయకులు రమణారెడ్డి,లక్ష్మయ్య, పుల్లయ్య, మామిళ్ల బాబు, రహమతుల్లాఖాన్, జిల్లా, నగర మహిళా అధ్యక్షురాళ్లు శ్యామలాదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా 1న జీతాలు ఇవ్వాలి

● ఎస్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల రామచంద్ర డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్ర

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 2 : ఉపాధ్యాయులందరికీ ప్రతినెలా 1వతేదీనే జీతాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల రామచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీ బకాయిల విడుదలకు నూతన విధివిధానాలు రూపొందిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాలసిన ఆర్థిక బకాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు రాజగోపాల్‌రెడ్డి, మదన్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీరామ్, రవిశంకర్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

సింహాద్రిపురం, జనవరి 2: మండలంలోని బలపనూరులో పులివెందుల మెయిన్ రోడ్డు పక్కన అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సమాచారం మేరకు అతనిని పట్టుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశామన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప (క్రైం), జనవరి 2: కడప నగరం వినాయక నగర్ వద్ద మద్యం విక్రయిస్తున్న నరసింహులును అరెస్టు చేసి అతను వద్ద నుంచి 9 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ రాజా తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తెలిస్తే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు.

ఇంటి పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

కడప (క్రైం), జనవరి 2: కడప నగరం మంగళవీధిలో హమాలీ పనిచేస్తున్న రవికుమార్(40) తానున్న ఇంటిపై నుంచి ప్రమాద వశాత్తూ కిందపడి మృతిచెందినట్లు టూటౌన్ ఎస్‌ఐ సంజీవ రాయుడు తెలిపారు. హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగి స్తున్న ఈయన ఈనెల 1న మధ్యాహ్నం మద్యం సేవించి తాను ఉంటున్న రెండో అంతస్తుపై ఉన్న పిట్టగోడ నుంచి జారీ పడ్డాడు. తీవ్ర గాయాలై మృతిచెందాడు. రవికుమార్ భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆపస్ క్యాలెండర్, వాల్‌పోస్టర్ విడుదల

పెండ్లిమర్రి, జనవరి 2: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) క్యాలెండర్, వాల్‌పోస్టర్స్‌ను ఎంఈఓ సుజాత, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కళావతిలు విడుదల చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో విడుదలచేసిన అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ క్యాలెండర్ దేశభక్తి ప్రబోధాత్మకంగా ఉందని ప్రశంసించారు. ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తిరుమల కొండయ్య, లక్ష్మయ్య, శేషగిరిరావు, సుబ్బన్న, జయరాం, సురేంద్ర, చంద్రశేఖర్, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి అండగా నిలవాలి

● బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో పుత్తా నరసింహారెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

పెండ్లిమర్రి, జనవరి 2: తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచి రాష్ట్రాభివృద్ధికై పాటుపడే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పెండ్లిమర్రి గ్రామంలో పుత్తా నరసింహారెడ్డి బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రతి రైతుకు యేడాదికి రైతు నిధి కింద రూ.20వేలు, యువగళం పథకంలో 20లక్షల ఉద్యోగాలు కల్పించడం, డిగ్రీ పూర్తి ఖాళీగా ఉన్న యువతకు ప్రతినెల మూడు వేల రూపాయలు అందించడం, ప్రతి ఇంటికి ఉచిత మంచినీరు అందించడం ఇలామరెన్నో సంక్షేమ పథకాలు చంద్రబాబు ప్రవేశపెడుతారని తెలిపారు. కావున వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చంద్ర ఓబుళరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రామాంజనేయులు, టీడీపీ నాయకులు సారథిరెడ్డి, ఆరవేటి చంద్రారెడ్డి, లక్ష్మినారాయణ, అయ్యవారురెడ్డి, చెంద్రాయుడు, రామసుబ్బారెడ్డి, అన్నమయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కార్మిక వర్గ పోరాటాలపై నిర్లక్ష్యం తగదు'



నిరసన తెలుపుతున్న సీపీఎం సభ్యులు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 2: కార్మిక వర్గ పోరాటాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ఏ మాత్రం తగదని, తక్షణమే వారి డిమాండ్లు తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఐఎన్ సుబ్బమ్మ, కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరంలోని పూలే సర్కిల్‌లో కార్మికవర్గ పోరాటాలకు సంఘీభావంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గంపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టినట్టు స్పష్టంగా కనబడుతోందన్నారు. సీఎం గతంలో అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు తదితర రంగాల ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ డీఏ తదితర బకాయిలన్నీ వేల కోట్లలో పెండింగులో ఉన్నాయని చెబుతున్నారని, వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు, బెదిరింపుల ద్వారా పోరాటాలను అణగదొక్కాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కార్మికుల ఐక్యతను చీల్చే ప్రయత్నం ఆపాలని డిమాండ్ చేశారు. నగర కమిటీ సభ్యులు జమీల, మహబూబ్‌తార, షకీలా, రమాదేవి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

అవ్వతాతలను మోసం చేసిన వైఎస్ జగన్

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 2 : అవ్వ, తాతలకు రూ.3వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వతాతలకు రూ.3వేలు పెన్షన్ ఇస్తామని మోసం చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యిరూపాయలు పెన్షన్ చేసిందని, అలాగే వెయ్యి నుంచి రూ.2వేలు చేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. అయితే తాను అధికారంలోకి వస్తే రూ.3వేలు చేస్తామని వైఎస్ జగన్ పాదయాత్రలో అవ్వతాతలకు హామీ ఇచ్చారన్నారు. అయితే రూ.3వేలు చేయకుండా రూ.2250 పెంచి మోసం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఐదేళ్లలో ప్రతి అవ్వతాతకు రూ.30వేలు రుణపడి ఉన్నాడని చెప్పారు. వాటిని తక్షణం అవ్వతాతలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 2014కు ముందు 34 లక్షల పెన్షన్లు ఉన్నాయని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 54లక్షలకు పెంచారన్నారు. జగన్ ప్రభుత్వంలో 200 యూనిట్లకు పైన కరెంటు వినియోగిస్తే వారికి పెన్షన్ రద్దు చేయడం దుర్మార్గమన్నారు. కేవలం తమ వారికి లబ్ధి చేకూర్చడం తప్ప ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఎటువంటి లాభం చేకూర్చడంలేదని ఆరోపించారు. వైఎస్ జగన్ తన నాలుగన్నరేళ్ల పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఇంకేమీ చేయలేదన్నారు. ప్రతి అవ్వతాతకు రావాలసిన రూ.30వేలు పెన్షన్ డబ్బును తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

8వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె



కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 2 : మున్సిపల్ కార్మికులను ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి భిక్షాటన చేయిస్తున్నాడని మున్సిపల్ కార్మికుల నాయకులు ఆరోపించారు. మంగళవారం కార్పొరేషన్ ఎదుట నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మె 8వ రోజుకు చేరుకంది. ఈ సమ్మెకు ఆర్‌సీపీ నాయకులు పూర్తి మద్దతుపలికారు. అనంతరం సీఐటీయూ నాయకులు ఇత్తడి ప్రకాశ్ మాట్లాడుతూ సమ్మె ప్రారంభమై 8 రోజులు అవుతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. బాధ్యత గల రాష్ట్రంలో మంత్రులు చర్చలతో కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. అధికారవర్గం నుంచి బెదిరింపులకు పాల్పడడం సరికాదని, పోలీసులను మోహరించి సమ్మె అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఆర్టీయూ నాయకులు సిద్దిరామయ్య, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మద్దతు తెలుపుతూ మున్సిపల్ కార్మికులు తమలాగా కోట్లతో ఇల్లు కట్టుకోవాలని కోరుకోవడంలేదని, వంద కి.మీ హెలిక్యాప్టరులో విమానాల్లో తిరగాలని కోరుకోవడంలేదని గతంలో ప్రతిపక్ష నాయకుడుగా ఇచ్చిన హామీలే ఈ రోజు నెరవేర్చమని రోడ్లపకి వచ్చి ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. తమ ఎమ్మెల్యేలకు ఉన్నట్లుగా లక్షలుజీతాలు, పింఛన్లు కోరలేదన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చమని నాలుగున్నరేళ్లు ఎదురు చూసి పలుమార్లు నిరసనలు చర్చలు జరిపి ప్రస్తుతం నిరవధిక సమ్మెకు సిద్దపడ్డారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన కోరికలు నెరవేర్చాలని కోరారు. బెదిరింపులకు భయపడేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌కార్మికుల నాయకులు సుంకర రవితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రామాలయం అక్షింతల పంపిణీ



చెన్నూరులో శ్రీరాముని అక్షింతలు, ఫోటో పంపిణీ చేస్తున్న అయోధ్య రామాలయం కమిటీ సభ్యులు

చెన్నూరు, జనవరి 2 : అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలు, అయోధ్య రామాలయం ఫోటోను చెన్నూరులో రామాలయ కమిటీ సభ్యులు పాలగిరి వాసుదేవరెడ్డి, సుబ్బారెడ్డి ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం స్థానిక బుడ్డాయపల్లెలో ఈ అక్షింతలు, ఫోటోలు పంపిణీ చేస్తూ రామాలయం విశిష్టత, ఔన్నత్యం, గుణగుణాలను తదితర విషయాలను వివరించారు. రామాలయం లేని ఊరంటూ లేదని, సర్వమానవాళికి జీవిత సాఫల్యానికి, మానవ జీవనానికి శ్రీరాముడే ఆదర్శమని వారు వివరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 2 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. మంగళవారం కడప నగరం వైఎస్ ఆర్ ఆడిటోరియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు నిత్యానందరెడ్డి, ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

ఆపస్ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండరు ఆవిష్కరణ

చెన్నూరు, జనవరి 2 : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) డైరీ, క్యాలెండరు, వాల్‌పోస్టర్‌ను ఎంఈఓ-2 సునీత మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 మాట్లాడుతూ డైరీలోని అంశాలు ఉపాధ్యాయ వర్గానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు.బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పద్మనాభం, ఆపస్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బనరసయ్య, మండల ప్రధాన కార్యదర్శులు లక్ష్మిరెడ్డి, బలరామిరెడ్డితో పాటు ఉపాధ్యాయ సంఘం నేతలు వెంకట్, నాగరాజు, రెడ్డయ్య పాల్గొన్నారు.

ఆశాలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప (మారుతీనగర్), జనవరి 2 : ఆశా కార్యకర్తల సమస్యలు త్వరితగతిన పరిష్కరించి తద్వారా వారిని పర్మినెంటు మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కాలనీలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ నందితను కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ నెల 8న అన్ని మండల తహసీల్దార్లు, 10న రెవెన్యూ డివిజన్ అధికారులకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. ఆశా వర్కర్లు యూనియన్ జిల్లా నాయకురాలు భూలక్ష్మి, స్వర్ణకుమారి, ఆశా, మహేశ్వరి, ఈశ్వరమ్మపాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు




ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి...రాహుకాల దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కడప (కల్చరల్), జనవరి 2: కడప నగరం బిల్టప్ సమీపంలో గల విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి చేరుకుని నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పులివెందులలో టీడీపీకి ఒక్క చాన్స్ ఇవ్వండి: బీటెక్ రవి



కొత్తపల్లెలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందిస్తున్న బీటెక్ రవి

వేముల, జనవరి 2: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమైందని, కావున పులివెందులలో కూడా టీడీపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మంగళవారం మండలంలోని వి.కొత్తపల్లె, అమ్మయ్యగారిపల్లె గ్రామాలలో మండల పరిశీలకుడు మారెడ్డి జోగిరెడ్డి, కొత్తపల్లె గ్రామ నాయకుడు రమణారెడ్డితో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ, బీటెక్ రవితో అడుగేద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వం వస్తే అందించే ఆరు గ్యారెంటీలలో మహాశక్తి పేరిట తల్లికి వందనం పేరుతో పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15వేలు, 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, దీపం పథకంపేరుతో ప్రతి ఇంటికి ఖచ్చితంగా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు అగ్రతాంబూలం ఇస్తూనే బీసీలకు రక్షణ చట్టం, అన్నదాతను ఆదుకుంటూ ఏడాదికి రూ. 20వేలు అందిస్తామన్నారు. నిరుద్యోగులకు యువకులం పేరిట ఉద్యోగ కల్పనకు కృషి చేస్తామన్నారు. పులివెందుల నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా తీసుకుంటూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు పాత ఇన్సూరెన్స్ విధానాన్ని కొనసాగిస్తామన్నారు. పొలాలకు ముళ్లకంచెను రాయితీ పద్ధతిలో అందించేందుకు కూడా కృషిచేస్తామన్నారు. పాత పద్దతిలో డ్రిప్పుపరికరాలు 90శాతం సబ్సిడీతో పాటు 10 ఎకరాలకు రైతులకు ఇస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, మండల క్లస్టర్ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, తూగుట్ల రాఘవరెడ్డి, పెర్నపాడుచిన్న అంకిరెడ్డి, వడ్డారపు ఓబయ్య, కొత్తపల్లె తులసిరెడ్డి, వెంకటేశ్, చంటి పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు వహించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్

కడప రూరల్, జనవరి 2: ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని పిల్లల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ బాబా పక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంను జడ్జి విజిట్‌చేసి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వసతి సదుపాయాలను ఆడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015 వివరించారు. జువెనైల్ జస్టిస్ చట్టం, న్యాయ సహాయం, రక్షణ సలహా వ్యవస్థ, ఉచిత న్యాయసహాయం తదితర అంశాలను తెలియపరిచారు. ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, జువైనల్ జస్టిస్ బోర్డ్ జడ్జి జె.నందిని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు, ప్రభుత్వ బాలుర వసతి గృహము సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

భయపెట్టిస్తే భయపడేవారం కాదు



కడప: పత్రాలను దహనం చేస్తున్న అంగన్వాడీలు

కడప (నాగరాజుపేట), జనవరి 2:అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గత 22 రోజులుగా అంగన్వాడీలు రోడ్డున పడి సమ్మె చేస్తున్నా సీఎం జగన్‌కు ఏ మాత్రం కనికరం లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం కడప రూరల్ ఆఫీసు వద్ద మోకాళ్ల మీద కూర్చుని అంగన్వాడీలు నిరసనలు తెలిపారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా సమ్మెను ఎలాగైనా భగ్నం చేయాలనే ఆలోచనతో ఈ నెల 5వతేదీ నుండి విధుల్లో చేరాలని అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం భయపెట్టేలా ఆర్డర్లు పాస్ చేస్తే ఇక్కడ భయపడేది ఎవరూ లేరన్నారు. ఆ మేరకు మంగళవారం ఆఫీసు ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, తులసి, క్రిష్ణవేణి, సంటెమ్మ, సావిత్రి రెడ్డమ్మ, ఈశ్వరమ్మ, గంగోజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మొండివైఖరి వీడాలి: కామనూరు

కమలాపురం (కడప ఎన్జీఆర్ సర్కిల్), జనవరి 2 : అంగన్వాడీలతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వమైనా కొనసాగిన చరిత్ర లేదని ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి హెచ్చరించారు. అంగన్వాడీల కార్యకర్తలు, సహాయకులు 5 నుండి విధుల్లో చేరాలని భయపెట్టి సూపర్‌వైజర్లు ఇబ్బందులు పెట్టవద్దన్నారు. జిల్లా అధ్యక్షుడితో పాటు అంగన్వాడీ నాయకురాలు ప్రభావతి, భారతి, దేవి పాల్గొన్నారు.

అంగన్వాడీలపై మొండివైఖరి విడనాడాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప (నాగరాజుపేట), జనవరి 2: అంగన్వాడీలపై జగన్ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి వారి సమస్యలు పరిష్కరించాలని, అంగన్వాడీలతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం నిలవలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని గత 22 రోజులుగా కఠోర సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏ మాత్రం కనికరంలేదన్నారు. పైగా అంగన్వాడీలపై దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, అంగన్వాడీ నాయకురాలు వసుంధర, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి: ఆర్సీపీ

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 2 : అంగన్వాడీలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమైనా ఇంత వరకు బతికి బట్ట కట్టలేదని, జగన్ ప్రభుత్వానికి కూడా అలాంటి రోజులే దగ్గర పడ్డాయని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు ఈ సందర్భంగా మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 22 రోజుల నుంచి అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నా జగన్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆర్సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిద్దిరామయ్య, ఆప్‌కిఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్‌బాషా, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి లుతస్లిం, లక్ష్మిదేవి, నగర కార్యదర్శివర్గసభ్యులు మడగలం న్నారు. ప్రసాద్, పెంచలయ్య పాల్గొన్నారు.

వేంపల్లెలో...



వేంపల్లెలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

వేంపల్లెలో అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద వేంపల్లె, చక్రాయపేట, వేముల మండలాల అంగన్వాడీ ఉద్యోగులు సమ్మెలో కూర్చున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలుచేశారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు పలికారు. ప్రభుత్వం దిగిరావాలన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపండి : భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జనవరి 2: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 11, 12 వార్డుల్లో బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు దేవగుడి నాగేశ్వరరెడ్డి యూత్ బృందం, అభిమానులు పాల్గొన్నారు.







చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం : వరద


మేనిఫెస్టోను వివరిస్తున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 2 : అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక 25వ వార్డు మట్టిమసీదు వీధి, శాంతకుమారి వీధులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, నాగమునిరెడ్డి , ఘంటశాల వెంకటేశ్వర్లు, ఖలందర్ షేక్ జాఫర్, ముస్తఫా, ఖలీమ్ షేక్ ఖాజా, అబ్దుల్ రహమాన్, షామీర్, ముల్లా రియాజుద్దీన్, గౌస్ బాషా, ఖాజా మోహిద్దీన్ జావీద్‌ఖాదరవల్లి, ఖాసీం రోషన్ సాదక్ టప్పా మహబూబ్‌బాషా, మాజీ కౌన్సిలర్లు తలారి పుల్లయ్య ,పాములేటి నరసింహులు ,పల్లా శంకర్, రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రుల భవిష్యత్తుకు చంద్రబాబే దిక్కు


ప్రచారంలో పాల్గొన్న మౌనికారెడ్డి

ప్రొద్దుటూరు ,జనవరి 2 : రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబే దిక్కని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొత్త పల్లె పంచాయతీలోని కానపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితారెడ్డి, ఆవుల దస్తగిరి, మాజీ కౌన్సిలర్ భాగ్యమ్మ,టీడీపీ నాయకులు సుధీర్ కుమార్ కిషోర్ కుమార్, దేవేంద్రరెడ్డి, చిన్నపుల్లయ్య, సుంకర వేణు, వినోద్‌రెడ్డి, కమాల్ బాషా, తాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే అభివృద్ధి

మైలవరం, జనవరి 2 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నక్కవానిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ముందుగా అంకాలమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలోటీడీపీ నాయకులు కొండయ్యయాదవ్, పాపిరెడ్డి, లక్ష్మణ్ నాయక్, రామయ్య నాయక్, తిరుమలరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, భూపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ఎన్నికల స్టంట్ : టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కాశినాయన జనవరి2: గంగనపల్లెవద్ద తెలుగంగ కాలువపై ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు వైసీపీ నాయకులు మంగళవారం ఎంపీ అవినాష్‌రెడ్డితో భూమిపూజ చేయించడం ఎన్నికలస్టంట్‌అని కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ నాయకులు ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి,మాజీ ఎంపీటీసీ పోలిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రితీష్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రజలు తెలుగంగ కాలువపై ఎత్తిపోతల పథకం,ఉప్పలూరు వద్ద సగిలేరుపై బ్రిడ్జి, మండలంలోని రోడ్లదుస్థితి ఆయన దృష్టికి తెచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పై మూడు పనులు తప్పక చేయిస్తానని ప్రజలకు రితీష్ హామీ ఇచ్చారు. ఇది గమనించిన వైసీపీ నాయకులు నెలరోజుల్లో ఎన్నికలకోడ్ వస్తుందని తెలిసీ ఆగమేఘాలమీద భూమిపూజ ఏర్పాటుచేయడం ప్రజలను మోసంచేయడంకాదాఅన్నారు.సమావేశంలో నేతలు శ్రీనివాసులరెడ్డి,నరసింహారెడ్డి,రామసుబ్బారెడ్డి,హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డిని కలిసిన తెలుగునాడు విద్యుత్తు కార్మికులు



జమ్మలమడుగు, జనవరి 2: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం తెలుగునాడు విద్యుత్తు కార్మికులు ప్రొద్దుటూరు డివిజన్‌కు చెందినవారు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిని కలిశారు. ప్రస్తుతం విద్యుత్తు కార్మికుల సమస్యలను ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్తు కార్మికులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 2 : దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.పెంచలయ్యను యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ రవీంద్రుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు పెంచలయ్య 2023 సంవత్సరంలో ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా విధులకు హాజరవ్వడం హర్షణీయమన్నారు. ఇతర ఉపాధ్యాయులు కూడా ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కొండారెడ్డి, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం గుర్రప్ప పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకానికి భూమిపూజ

కాశినాయన జనవరి2: ఎత్తిపోతల పథకానికి మంగళవారం ఎంపీ అవినాశ్‌రెడ్డి గంగనపల్లె సమీపంలో తెలుగంగ ఎడమకాలువపై వరికుంట్ల చెరువుకు నీరందించేందుకు ఎమ్మెల్యే సుధా,ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో బద్వేల్ మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కరెంట్ రమణారెడ్డి. కడప మేయర్ సురేష్ బాబు,ఫుడ్‌కార్పొరేషన్ చైర్మన్‌విజయ్‌ప్రతాప్‌రెడ్డి, రాష్ట్రపంచాయతీ రాజ్ సలహాదారుడు నాగార్జున్‌రెడ్డి, జి.హనుమంత్‌రెడ్డి,ఎం.క్రిష్ణారెడ్డి, గొంటువారిపల్లె సర్పంచ్ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం : పుట్టా


బజ్జీలు వేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

ఖాజీపేట, జనవరి 2: టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పత్తూరులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫరూక్, సుబ్బయ్య, జిలానీ, సిద్దారం ఖదీరుల్లా, రాము, జానకిరాం, పిచ్చినాయుడు, పుల్లయ్యనాయుడు, రామానాయుడు, రమణ, గంగయ్య, సంజీవరాయుడు, వెంకటేష్, బ్రహ్మనాయుడు, సందీప్‌నాయుడు, పాలకొండ్రాయుడు, సురేష్, ఆరోహణ, కుమార్, కిశోర్‌కుమార్‌రెడ్డి, రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **బజ్జీలు వేసిన పుట్టా..:** భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న పుట్టా సుధాకర్‌యాదవ్ పత్తూరు గ్రామ కొట్టులో బజ్జీలు వేశారు.













